Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:11(1), November, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# ధర్మవ్యాధుని వృత్తాంతము – మానవీయ విలువలు

డా. నేమాని శారద
తెలుగు ఉపన్యాసకురాలు
డా. వి. యస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల
విశాఖపట్టణం

**సాహిత్యం – మానవ విలువలు:**

**"సహితా సాహిత్యమ్"** అని ఆర్యోక్తి. హితాన్ని కలిగించేదే సాహిత్యం. కాబట్టి సాహిత్యం సమాజాన్ని, సమాజంలోని వ్యక్తుల మనస్తత్వాలను విశ్లేషిస్తుంది. ప్రజలలో విశ్వజనీన భావాలను పెంపొందిస్తుంది. సాహిత్యం వ్యక్తులలో మానవతా విలువల ప్రచారానికి, తద్వారా వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుంది. సాహిత్యం వ్యక్తుల చైతన్యపు లోతులను పెంచి, వారి జీవితానుభవాలను విశాలం చేస్తుంది. మానవుడు తనపై తాను ఆత్మవిశ్వాసం పెంచుకునేలా చేసి, ఉత్తమ గుణాల్ని అతనిలో ఉత్తేజితం చేస్తుంది. మన ప్రాచీన భారతీయ సాహిత్యం ఈ ధర్మాన్ని పూర్తిగా నెరవేర్చింది. భారతీయ సాహిత్యానికే మకుటాయమానమైనది 'మహాభారతం'. "భారతం" 'ధర్మం' యొక్క సమగ్ర స్వరూపాన్ని మనకు అందించే గ్రంథం. 'ధర్మం' అనేక మార్గాలలో అన్వయించుకోవలసిన అతి సూక్ష్మమైన విద్య. ఈ ధర్మానికి సంబంధించిన అంశాలు 'మహాభారతం'లో కోకొల్లలు.

**ధర్మవ్యాధుని వృత్తాంతం:**

మానవవిలువలను గూర్చి చక్కగా విశదీకరించిన కథ 'మహాభారతం' అరణ్యపర్వం పంచమాశ్వాసమునందలి ధర్మవ్యాధ వృత్తాంతం.

కౌశికుడనే బ్రాహ్మణుడు ఒక పతివ్రతను తనకు త్వరగా భిక్ష పెట్టనందుకు నిందిస్తాడు. అప్పుడా పతివ్రత కౌశికునితో ధర్మసూక్ష్మాన్ని గూర్చి తెలుసుకోవడానికి ధర్మవ్యాధుని ఆశ్రయించమని చెబుతుంది.

ధర్మవ్యాధుడు అనే కిరాతుడు జితేంద్రియుడు, సత్యవాది, తల్లిదండ్రులపట్ల గౌరవాభిమానాలు కలవాడు. అతడు మిథిలానగరంలో వుంటాడు. కౌశికుడు మాంస విక్రయశాలలో వున్న ధర్మవ్యాధుని కలుసుకుని ధర్మసూక్ష్మాలు తెలుసుకుంటాడు.

**అహింసయందలి ధర్మసూక్ష్మాన్ని తెలుపుట:**

మొదట కౌశికుడు ధర్మవ్యాధునితో నీవు గొప్ప ధర్మవిదుడవు. మాంస విక్రయమును ఏల చేస్తున్నావని ప్రశ్నిస్తాడు. అప్పుడు ధర్మవ్యాధుడు ఎవరికి అనువైన ధర్మాలు వారు ఆచరించాలనీ, మాంసోపజీవనం తనకు వంశానుక్రమంగా సంక్రమించిన ఆచారం కాబట్టి, తమ ప్రభువైన జనకమహారాజు స్వధర్మాన్ని విడరాదన్నాడు కాబట్టి తాను మాంసాన్ని విక్రయిస్తున్నాని చెప్పాడు.

**పెద్దలను గౌరవించుట:**

ధర్మవ్యాధుడు కౌశికునితో

**"వినయము విస్తరిల్ల గురువృద్ధ జనాతిథి విప్ర దేవతార్చన లొనరింతు......"**

అరణ్యపర్వం –వంచమా – 34ప

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:11(1), November, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

మిక్కిలి అణకువతో గురువులను, పెద్దలను, అతిథులను, బ్రాహ్మణులను, దేవతలను పూజించాలనీ, పరిశుభ్రంగా వుండాలనీ, సేవకులకు దానాలు, బంధువులకు మర్యాదలు చేయడం, ఓర్పుతో వుండడం, అసూయ, దురాశలను దరికి చేరనివ్వరాదని, ఇతరుల దోషాలను గూర్చి ఎన్నడూ మాటడరాదనే చక్కని విలువల జీవితాన్ని బోధిస్తాడు.

ఆహారనియమాలు పాటించాలి, పొగడ్తలకు పొంగిపోవడం, విమర్శకు క్రుంగిపోరాదనే మానసత్త్వ అంశాలను కూడా ప్రస్తావించాడు.

**దయ యొక్క గొప్పతనం:**

**"తన కులధర్మము విడువక...."** **అరణ్య – పంచమా – 37వ**

మనిషి దయ అనే భావాన్ని కలిగి వుండాలి. దయాగుణమే అన్నింటికన్నా గొప్పది. తన అభిప్రాయమే గొప్పది అనే భావాన్ని విడనాడాలని చెప్పాడు.

**అరిషడ్వర్గాలను జయించుట:**

**"పాపముల కెల్ల నెక్కుడు పాతకములు...."** **అరణ్య – పంచమా– 42 వ**

అన్ని పాపాలకన్నా మిక్కిలి చెడ్డవి కోపం, లోభం. వాటిని జయించలేనివాడు ధర్మాత్ముడు కానేరడు. కపట ధర్మాలను వదలివేసి, మనుష్యులు శిష్టాచారాలను స్వీకరించాలి.

**మానవుడు ఆచరించవలసిన ధర్మాలు:**

ధర్మవ్యాధుడు శిష్టాచారాలను గూర్చి చెబుతూ మానవుడు ఆచరించవలసిన ధర్మాలను వివరించాడు.

- ఎదుటివారికి సహాయం చేయాలి.
- ఎల్లప్పుడూ సత్యాన్నే మాట్లాడాలి.
- ఇంద్రియాలను నిగ్రహించాలి.
- విశ్వశ్రేయస్సును కూర్చే క్రతువులను ఆచరించాలి.
- ఇతరులను మోసగించరాదు.
- కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను జయించాలి.
- తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలి.
- శాంత స్వభావాన్ని కలిగి వుండాలి.
- ఎల్లప్పుడూ సంతోషంతో, సంతృప్తితో జీవించాలి.
- వినయాన్ని కలిగి వుండాలి.
- నీచత్వానికి దిగజారకూడదు.
- అఖిల భూతాలపట్ల దయ కలిగి వుండాలి.
- మితభాషణం, హిత భాషణం చేయాలి.
- ఆశ్రయించిన వారిని రక్షించాలి.
- అసూయను విడనాడి, సత్ప్రవర్తనతో ప్రవర్తిస్తే కలిగే సంతోషం మనిషికి యింకే విధంగానూ లభించదు.

అంతేగాక

**"వినుము హింస ధర్మవితతి కెల్లను మేటి.... "** **అరణ్య – పంచా – 48 వ**

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:11(1), November, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

అన్ని ధర్మాలలోనూ అహింస గొప్పది. ఈ అహింస సత్యంతో కూడి వుంటే వెలుగొందుతుంది. అనే జీవిత సత్యాలను బోధించాడు.

**ధర్మ సూక్ష్మాలు:**

ఏది హింస, ఏదహింస అనేది ధర్మ సూక్ష్మమైన విషయం. రైతు నాగలితో భూమిని దున్నేటప్పుడు అనేక జీవాలు మరణిస్తాయి. అంతమాత్రాన అది హింసకాదు. నీరు, భూమి, ఆకాశం అన్నీ ప్రాణుల సమూహాలే, అన్ని పనులలో ఎంతో కొంత హింస జరుగక తప్పదు. అసలు హింసే చేయనివాడు ఈ లోకంలో లేడు. అయితే తమకు వీలైనంతవరకూ హింస చేయకుండా జీవయాత్ర చేయడమే మానవధర్మం. అనే మంచి ధర్మ సూక్ష్మాన్ని ధర్మవ్యాధుని ద్వారా కవి లోకానికి బోధించాడు.

**"భూతహితంబుగా బలుకు బొంకును సత్యఫలంబునిచ్చు..." అరణ్య – పంచమా – 62ఎ**

అనే పద్యంలో ప్రాణికోటికి మేలు జరగడానికి చెప్పబడిన అసత్యం, సత్యంకన్నా కూడా గొప్పది. అదే ప్రాణులకు కీడు కలిగించే సత్యం. అసత్యంకన్నా నీచమైనది. ఇదే ధర్మసూక్ష్మం. దీనినే మానవులు ఆచరించాలి.

**ఇంద్రియ నిగ్రహం:**

**ధర్మవ్యాధుడు "ఇంద్రియార్థంబులకెలసిన పురుషుండు...." అరణ్య – పంచమా – 81ప**

ఇంద్రియభోగాలకు లోనైన మనిషికి కామ ప్రవృత్తి పెరిగి లోభం ఏర్పడి, దయకు దూరమై, గర్వానికి లోనవుతాడు. పాపకార్యాలకు పాల్పడతాడు. పెద్దల మాటలను విశ్వసించడు, చెడిపోతాడు. కాబట్టి విషయ భోగాలలో మనస్సును చిక్కనీయక సాధు జనుల సహవాసం చేయాలి.

**"ఇంద్రియంబులు దివిచిన యెడక పాఱుచుండు ...." అరణ్య – పంచమ– 93వ**

ఇంద్రియాలు ఆకర్షించిన చోటికే మనస్సు సదా వెళుతూ వుంటుంది. దానిని అదుపులో పెట్టకపోతే సంద్రంలో పెనుగాలి తాకిడికి పగిలి నశించే పడవవలె బుద్ధి పాడైపోతుంది. ఐదు ఇంద్రియాలను వశం చేసుకున్నవాడే ధ్యానయోగి, అటువంటి మనిషినే అందరూ పొగుడుతారు. అంటూ మానవుడు తన ఇంద్రియాలను నిగ్రహించుకోవలసిన అవసరాన్ని లేనిచో కలిగే అనర్థాలను వివరించాడు.

**నత్త్వరజోస్తమో గుణ లక్షణాలు:**

**"అసుఖాకారత నిద్రదైన్యము విమోహం బక్షమత్వంబు దామస భావంబులు....."**

**అరణ్య– పంచమా – 97వ**

సంతృప్తి లేకపోవడం, నిద్దర మత్తులో వుండటం, హీనత్వం, భ్రాంతి, అసహనం తమోగుణ లక్షణాలు. దురాశ, లోభం, జడత్వం, దురహంకారం, రజోగుణ లక్షణాలు, చలించని చిత్తవృత్తి, మానసిక సంతృప్తి, జాలి, దయ, సంతోషం, తెలివితేటలు సత్త్వగుణ లక్షణాలు.

**జ్ఞాని యొక్క లక్షణాలు:**

ధర్మవ్యాధుడు కౌశికునితో నిజమైన జ్ఞాని ఏవిధంగా వుంటాడో తెలియజేసాడు.

**"అరయగ జీవితంబు గడునస్థిర; మింత యెఱింగి యాత్మనె**
**వ్వరిదెస గీడు రోయక ధ్రువంబగు మైత్రి భజించి...." అరణ్య –పం – 111ప**

మానవుని జీవితం నిలకడలేనిది. ఈ విషయాన్ని అనుభవపూర్వకంగా గ్రహించిన జ్ఞాని తోటివారికి అపకారాన్ని తలపెట్టడు. అందరి యెడల ప్రేమ పూర్వకమైన స్నేహాన్ని కలిగి వుంటాడు, దయకలిగి వుంటాడు,


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:11(1), November, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

ఎవరినీ యాచించడు. అతడు నిత్య సంతృప్తుడు. అటువంటి మనిషి శాశ్వతమైన ఆనందస్థితిని పొందగలడు.

**తల్లిదండ్రులను సేవించుట:**

సమకాలీన మానవులకు అవసరమైన చక్కని బోధ ఇది. తల్లిదండ్రులను బిడ్డలు ఏవిధంగా సేవించాలో ఈ పద్యంలో ధర్మవ్యాధుని ద్వారా కవి లోకానికి బోధించాడు.

**"జనని జనకుడు నద్గురడనలు డాత్ముడనగ....." అరణ్య – వంచమా – 118వ**

తల్లిదండ్రులే ప్రత్యక్ష దేవతలు. వారిని పూజించాలి. వారిని మించినవారు ఎవరూలేరు. వారి సేవయే యజ్ఞం. అవే వేదాలు, వ్రతాలు, పుణ్యం కోరే ప్రతీ మనిషీ తల్లి, తండ్రి, గురువు, ఆత్మ, అగ్ని అనే ఐదుగురినీ అర్చించాలి. అటువంటి వాడే నిజమైన ధర్మాత్ముడు.

**"నీయధ్యయనమ్మును సుకృతాయానము నిష్ఫలంబులైచను...." అరణ్య – వంచమా –122వ**

నీ చదువుగానీ. నీ పుణ్యంగానీ, నీవు పడే శ్రమగానీ నీ తల్లిదండ్రులను నీవు విస్మరించినచో వ్యర్థాలైపోతాయి అనే ధర్మాన్ని బోధించాడు. ఇది నేటి కాలానికి కూడా చాలా అవసరమైన ధర్మం. నేటి మానవులందరూ ఆచరించవలసిన మానవ ధర్మమిది.

**ముగింపు:**

ఆధునిక కాలంలో మానవుడు అనేక సంఘర్షణలతో జీవిస్తున్నాడు. మానవ జీవితంలో ఆతురత, అభద్రత పెరిగిపోతున్నాయి. అనారోగ్యాలు తలెత్తుతున్నాయి. వ్యక్తి దైనందిన జీవితంలో ఒత్తిడి పెరిగిపోతోంది. దీని వలన మనిషి మత్తు పదార్థాలకు బానిస అవుతున్నాడు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైపోయాయి. ఆరోగ్యకరమైన సంబంధాలు కరువవుతున్నాయి. తల్లిదండ్రులపట్ల బాధ్యత వుండడం లేదు. యువత పెడమార్గాన పయనిస్తోంది. ఇటువంటి అనేక కారణాల రీత్యా మనిషికి ఆనందం లేకుండా పోతోంది. మానవుడికి తన జీవితంపై శ్రద్ధ, సంతృప్తి కావాలంటే అతనికి ఆనందం కావాలి. ఆ ఆనందం పొందడానికి అతడు పాటించవలసిన అంశాలే మానవధర్మాలు. అవే మానవ విలువలు. విలువలతో కూడిన జీవితం మనిషికి సంతృప్తిని కలిగిస్తుంది. పై ధర్మవ్యాధ వృత్తాంతంలోని విషయం సమకాలీన సమాజంలో మానవుడు సత్వరంగా ఆచరించి తీరవలసిన మానవధర్మాలే. ఈ మానవీయధర్మాలను ప్రతీవ్యక్తీ ఆచరించినపుడే ఈ సమాజం ఉన్నత విలువలతో కూడి, స్వయం పరిపుష్టమవుతుంది. సదవగాహనతో సహజ అంగీకారంతో, సక్రమమైన రీతిలో, పద్ధతులలో విశ్వమానవ సంవిధానం ఏర్పడుతుంది.

**ఆధార గ్రంథాలు:**

1. ఆంధ్రమహాభారతం – నన్నయ, తిక్కన, ఎర్రన
2. మానవీయ విలువలు – గిరిజాశాస్త్రి, జి. శ్రీప్రభ
3. తెలుగు సాహిత్య విమర్శ – ఎస్.వి. రామారావు
4. తెలుగు సాహిత్య సమీక్ష – డా. జి. నాగయ్య